☆ 1992 న్యూజెర్సీ తెలుగు కళాసమితి వారి కథల పోటీలో రూ.1200లు ద్వితీయ

# సెకండ్ ఫ్రంట్

—ప్రకాష్



**చదరంగం ఆటంటే నాలో ఆసక్తి కలగటానికి కారకులు మా నాన్నగారే. సాయంత్రం ఆఫీసు నుంచి రాగానే పక్కింటి అంకుల్‌తో కలసి చదరంగం బల్ల ముందు కూర్చోవటం మా నాన్నగారి అలవాట్లలో ఒకటి.**

ఆఫీసు నుంచి నాన్నగారు వస్తుండటం గమనిస్తూనే చదరంగం బల్లనూ, పావులూ (వాటిని చెస్‌మెన్ అనాలని తరువాత తెలిసింది) వుంచే పెట్టెనూ టీపాయ్‌మీద పెట్టేవాడిని. రాజు, మంత్రి,

శకటం, గుర్రం, ఏనుగు, భటులు అనే పేర్లే నాకు భలే సరదా అనిపించేవి. చంపటం, చంప బడటం అనే పదాలు నాకు ఉత్సాహాన్ని కలిగించేవి. ఆట ప్రారంభమవగానే మెమ్మదిగా నాన్నగారి పక్కకు చేరేవాడిని. ఇరు వర్గాల బలాలూ ఎప్పుడెప్పుడు ఎదురవుతాయా అని గమనిస్తూ వుండేవాడిని. నా ఆసక్తిని గమనించిన నాన్నగారు, అంకుల్ తమ ప్రత్యర్థుల బలాలను నాచేతే చంపించేవారు. గెలుపు, ఓటముల మధ్య వ్యత్యాసం తెలియని ఆ వయసులో ఇరు వైపుల బలాలనూ ప్రత్యర్థులుగానే చూసేవాడిని. వయసు పెరిగే కొద్దీ చదరంగం ఎలా ఆడాలో, ఏయే బలాలను ఏవిధంగా నడిపించాలో నేర్చుకున్నాను. స్వపక్షాన్నీ, వైరి పక్షాన్నీ గుర్తించగలుగుతున్నాను.

గెలుపుకూ ఓటమికీ మధ్యగల తేడాను అనుభూతి పూర్వకంగా తెలుసుకున్నాను.

నాన్నగారిని నెల్లూరుకు బదిలీ చేయటంతో అంకుల్ వాళ్ళ దగ్గర శెలవు తీసుకుని నెల్లూరుకు వచ్చేశాము. ఆఫీసు నుంచి తిరిగి వచ్చే నాన్నగారికి ఇప్పుడు నేనే ప్రత్యర్థిగా మారాను.

మొదట్లో నాన్నగారిపై గెలుపు ఎండమావే అయింది. దాంతో నాలో పట్టుదల పెరిగింది. ఎలాగైనా గెలుపు గుర్రాన్ని అందుకోవాలని ఉవ్విళ్ళూరుతూ వుండేవాడిని. నా ఆటలో వేగాన్ని పెంచాను.

మెరుపు దాడులకు సిద్ధపడ్డాను. అడపాదడపా నాన్నగారిపై గెలవగలుగుతున్నాననేకానీ పూర్తిగా నాన్నగారి ఆటపై పట్టు సంపాదించలేక పోతున్నానింకా.

నేను మరింత పెద్దవాణ్ణయ్యాను. ఇప్పుడు నన్ను గెలవటం నాన్నగారికి దాదాపు అసాధ్యంగా మారింది. అంతేకాక ప్రతిరోజూ ఒకే వ్యక్తితో ఒకే రకమయిన ఫలితం పొందడం నాకూవిసుగ్గా వుంటోంది. కొత్త ప్రత్యర్థుల కోసం గాలించటం మొదలు పెట్టాను. క్రమంగా నా ప్రత్యర్థుల సంఖ్య పెరిగింది. ఎంత మంది ప్రత్యర్థులున్నా నా మనసు మాత్రం ఇప్పుడు ఒకే రకమయిన ఫలితాన్ని కోరుకుంటున్నది. గెలుపు, గెలుపు, గెలుపు! ఎవరిచేతిలోనైనా నేను ఓడిపోతే అతనిపై ప్రతీకారం తీర్చుకునే వరకూ నాకు

కోరమాండల్ సిమెంట్స్ లిమిటెడ్ వారి భీమ సిమెంట్

24-1-91 ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక

మనస్థిమితం వుండేది కాదు.

చదరంగం ఆటతోపాటే చదువును కూడా సమానస్థాయిలో కొనసాగిస్తున్నాను. డిగ్రీ మొదటి రెండు సంవత్సరాలూ నేనే చదరంగం ఛాంపియన్ని. మూడవ సంవత్సరం తొలి రోజులు నా జీవితంలో మరచిపోలేని రోజులు. జిల్లా స్థాయిలో రౌండ్ రాబిన్ పద్ధతిలో ఏర్పాటు చేసిన చెస్ టోర్నమెంట్‌లో పాల్గొని నాకంటే వయసులో పెద్దవారూ, అనుభవజ్ఞులైనవారితో తలపడి ఎంతో కష్టంతో మొదటి స్థానాన్ని ఆక్రమించగలిగాను. దినపత్రికలలో ప్రాంతీయ వార్తలు ప్రచురించే పేజీలో నా పేరును చూసి నాకంటే ఎక్కువగా మా నాన్నగారు ఎంత సంతోషించారో చెప్పలేను.

మూడవ సంవత్సరం పూర్తవుతోందనగా కాలేజీలో మళ్ళీ ఆటల పోటీలను ఏర్పాటు చేశారు. అప్పటికే జిల్లా స్థాయి ఆటగాడిగా ఎదిగిన నేను ఈ ఆఖరి సంవత్సరపు గెలుపుతో కాలేజీలో 'హ్యాట్రిక్' సాధించదలచుకున్నాను. ఆటలు ప్రారంభమయ్యాయి. ఫైనల్సుకు చేరటానికి నేను అంతగా కష్టపడవలసిన అవసరం లేకపోయింది. ఫైనల్సులో నా ప్రత్యర్థి ఆడపిల్ల అని తెలిసి కొంచెం ఆశ్చర్యపడ్డాను.

మా ఇద్దరి మధ్య ఆట ప్రారంభమయింది. ఆమె బలాలు ముందుకు రాకుండా నా భటులను నడిపిస్తూ బలసమీకరణ మొదలుపెట్టాను. ఆమె కంగారుపడుతున్న అనుభూతి కలిగింది నాకు.

కాజిలింగ్ ద్వారా అపుడే రాజును మూలకు పంపివేసింది. నా బలాలను ఆమె రాజు వైపు నడపటానికి రంగం సిద్ధం చేసుకున్నాను. మరో రెండు ఎత్తుల తరువాత పూర్తిస్థాయి దాడికి సిద్ధపడ్డాను. నా ఆలోచనలను కనిపెట్టినట్లుగా తరువాతి రెండు ఎత్తులను వేసే అవకాశం మాత్రం నాకివ్వలేదామె. రక్షణ ఏర్పాట్లు చేసుకుంటున్నట్లు కనిపిస్తూనే నా బలాలు కేంద్రీకరించిన వైపు కాకుండా రెండవ వైపు మెరుపు దాడికి దిగింది. ఒకే స్థానంలో శత్రువు బలీయంగా కేంద్రీకరించబడి వున్నపుడు వారి బలాలను వికేంద్రీకరించబడటానికి సైనికాధికారులు చేసే 'సెకండ్ ఫ్రంట్' వ్యూహ రచన. ఆమె ఆటలో వేగాన్నందుకుంది. నా భటులను తన మంత్రితో ఏరివేసే కార్యక్రమం చేపట్టిందామె. ఆట చివరి దశలో భటుల విలువేమిటో తెలిసిన నేను తప్పనిసరిగా నా బలాలను అటువైపు మళ్ళించాల్సి వచ్చింది. శకటానికి శకటం,

గుర్రానికి గుర్రం, చంపటం చావడమే ధ్యేయంగా పెట్టుకున్నట్టు ఆడుతోందామె. బల్లపై ఒక వైపు పూర్తి ఖాళీ ఏర్పడింది. కాజిలింగ్ ద్వారా విడుదల చేయబడ్డ ఏనుగుతో సహా రెండు ఏనుగులతో మంత్రితో పోరాడుతున్నదామె. ఖాళీ బల్లపై రెండు ఏనుగులతో దాడికి దిగితే కలిగే ప్రమాదాన్ని నేను గుర్తించేలోపలే రాజు, మంత్రి ఒకే వరుసలో వున్న సమయంలో మంత్రి కెదురుగా తన ఏనుగును తెచ్చిపెట్టింది. మంత్రిని పక్కకు తప్పించలేని పరిస్థితి. ఏనుగును చంపుదామంటే రక్షణగా వున్న మరో ఏనుగు ద్వారా నా మంత్రిని కోల్పోవటం ఖాయం. ఆటపై ఆమె ఆధిక్యత స్పష్టమయింది. 'హ్యాట్రిక్' సాధించాలనే నా కలను కల్లగా మిగిల్చుకుని ఓటమిని అంగీకరిస్తూ రిజైన్ చేశాను. ఆమెను అభినందిస్తూ మోగుతున్న చప్పట్లను భరించలేనట్లు అవమానభారంతో మౌనంగా బయటకు నడిచాను. ఆ తరువాత చదరంగంలో ఎంతో ఎత్తుకు ఎదిగినా ఆమె చేతిలోని ఆ పరాభవాన్ని మాత్రం నేను మరచిపోలేక పోయాను.

* * *

మా నాన్నగారు సర్వీసులోనే వుండి చనిపోవడంతో చనిపోయిన ఉద్యోగస్తుని వారసుడిగా ప్రభుత్వ ఉద్యోగినయ్యాన్నేను. నాకు పెళ్ళి ప్రయత్నాలు మొదలు పెట్టింది అమ్మ. అమ్మ తెచ్చిన ఫోటోలను చూస్తున్న నేను ఒక్కసారిగా ఆశ్చర్య పడ్డాను. ఆ ఫోటో ఆమెదే. గతం కళ్ళ ముందు మెదిలింది. ఇప్పుడు రెండవ వైపు నుంచి ఆమెపై గెలుపు సాధించటానికి సిద్ధపడ్డాను. చదరంగం బల్లపై నుంచి జీవితంలోకి! ఆమె ఫోటోను అమ్మకు చూపిస్తూ నా అంగీకారం తెలిపాను. కొద్ది రోజులలోనే మా వివాహం జరిపించారు పెద్దలు. మొదటి రాత్రి ఆమె అందాలు, అగరొత్తుల సువాసనలు, కవ్వించే మల్లెలు ఇవేవీ నాకు మత్తును కలిగించలేక పోయాయి. ఆటలో ఓడిన మత్తు ఇంకా దిగనే లేదు. నాలో పైశాచికత్వం జడలు విప్పింది. నాలోని పురుషాహంకారం ఆమె జీవితాన్ని చీకటిగా మార్చే ప్రయత్నం చేసింది. ఆమె ఎత్తులు వేయటానికి జీవితం చదరంగం బల్ల కాదు కనుక జీవితాంతం ఆమెపై నాదే గెలుపు అన్న భావన నాకు ఎంతో హాయిని కలుగజేస్తున్నది. నా అహాన్ని తృప్తి పరుస్తున్నది.

అయితే మరో రెండు వంవత్సరాలు గడిచేసరికి నా అంచనాలన్నీ దారుణంగా దెబ్బతిన్నాయి. ఆమె మరోసారి దాడికి సిద్ధపడింది. నా నుంచి విడాకులు కోరి తన జీవితం నుంచే నన్ను బయటకు విసిరేసింది. నాలోని శాడిజాన్ని క్షమించలేక పోయిన అమ్మ అంతకు ముందే ఈ లోకాన్ని విడిచింది. ఒంటరితనం నాకు సాటి మనిషి విలువను తెలియజేసింది. వివాహమనే ఎత్తు ద్వారా రెండవ వైపు నుంచి ఆమెపై గెలుపు సాధించాలనుకున్నాను నేను. ఆమె నేరుగా ఎదుర్కోవడంతో నా ఆట కట్టయింది. అంటే ఈ ఆటలో కూడా నేను చిత్తుగా ఓడిపోయాను. ☆

## పోటీలో ఎంపికైన కథలూ, కార్టూన్లూ

తెలుగు కళా సమితి న్యూజెర్సీ, 'ఆంధ్రజ్యోతి' సచిత్ర వారపత్రిక సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన చిన్న కథలు, కార్టూన్ల పోటీలో... ... 200 రూపాయిల చొప్పున ఎంపికైన ఆరు కథలనూ, కార్టూన్లనూ ఈ క్రింద ప్రకటిస్తున్నాము.

1. ఆడపిల్ల - ఆత్మగౌరవం — ఎడ్లమూడి దుర్గాంబ
2 తిరుపతి లడ్డు — జి. సీతారామ
3 మాయలో మనిషి–శివల జగన్నాధరావు
4 మధనం — జె.స్వర్ణలత
5 మాకీ నాన్నొద్దు — కంచుమర్తి వెంకటేశ్వరరావు
6 ఆరు గజాల జీవితం — 'హసన్'

కార్టూన్లు

ఒక్కొక్క కార్టూన్ రూ. 100/-ల చొప్పున ఈ క్రింది వారి కార్టూన్లు ఎంపికయ్యాయి.

1) టి.ఆర్. బాబు
2) వై. కరుణాకర్
3) శేఖర్
4) నందు (ఎ.పి.కె. గంగానందు)
5) బొబ్బిలి గౌతమ్
6) శారద
7) డి. గోపీకృష్ణ
8) జి.వి. (కె. బాలాజీ విఠల్)
9) తన్నీరు వెంకటేశ్వర్లు
10) బి. శ్రీనివాస్

— ఎడిటర్